తిమ్మగురుడు రథోత్సవం

గూడూరు, మే 4: గూడూరు తిమ్మగురుడు రథోత్సవం శనివారం కోలాహలంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గూడూరు జనసంద్రంగా కనిపించింది. తిమ్మగురుడు స్వామి ఆలయంలో స్వామి వారికి పవిత్ర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రథోత్సవానికి పూజలు చేశారు. పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు నిర్వహించారు.



భారీగా తరలి వచ్చిన భక్తులు

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం దుస్థితి ఇది



హామీలన్నీ హుళక్కే..!

- ఐదేళ్లలో సిద్ధాపురం ప్రాజెక్టు నిర్వీర్యం
- నత్తనడకన రూ.116.83 కోట్ల నాన్ అమృత్ వాటర్ స్కీం
- ఎత్తిపోయిన వీఆర్ఎస్పీ ఎత్తిపోతల పథకం
- శ్రీశైల క్షేత్రాభివృద్ధిని పట్టించుకోని వైనం
- ముందుకు సాగని షాదిఖానాల నిర్మాణం
- పూర్తికాని బండిఆత్మకూరు-ఓంకారం డబుల్ లైన్ రహదారి
- ఎమ్మెల్యే శిల్పా పని తీరుపై జనాల్లో వ్యతిరేకత

ఆత్మకూరు, మే 4: గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీశైలం నియోజకవర్గం ప్రజలకు అనేక హామీలను గుప్పించారు. అప్పట్లో ఊరూరా తిరిగి తన వాగ్దానాలతో ఊదరగొట్టారు. ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా వైసీపీ అధికారంలోకి వచ్చినా చేసిందేమీ లేదన్న విమర్శలు ఉన్నాయి. హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే శిల్పా విఫలమయ్యారన్న ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ఏముఖం పెట్టుకుని తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్నావని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఇచ్చిన హామీలపై ఆంధ్రజ్యోతి కథనం...

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వీర్యం

ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని సుమారు 21,300 ఎకరాల పంట భూములను సస్యశ్యామలం చేసే సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి 2006 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే అనేక అవాంతరాలతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి 2018 జనవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేశారు. ఈ పథకాన్ని తొలుత రూ.89.72 కోట్ల వ్యయంతో నిర్మించాలని భావించినప్పటికీ అంచనాలు భారీగా పెరగడంతో రూ.116.52 కోట్లు ఖర్చయింది. అయినప్పటికీ అవసరమైన నిధులను మంజూరు చేసి ఆయకట్టుకు నీరందించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయకట్టు పొలాలకు పంట కాల్వలను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే శిల్పా ఆ పనుల జోలికే వెళ్లలేదు. దీనికితోడు ప్రాజెక్టు నిర్వహణకు కావాల్సిన నిధులను మంజూరు చేయించడంలో విఫలమయ్యారు. ఇప్పటికే తూము గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. మట్టికట్ట బలహీనపడి రంధ్రాలు పడ్డాయి. విద్యుత్ బకాయిలు రూ.30 కోట్లకు చేరాయి. ఇలా అనేక విధాలుగా వైసీపీ పాలనలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యమైందన్న విమర్శలు ఉన్నాయి.

మహానంది మండలానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయో..

మహానంది - గాజులపల్లి మధ్యలో ఉన్న పాలేరు వాగుపై వంతెన నిర్మాణం చేపడతానని చెప్పి ఇంత వరకు ఆ ఊసే ఎత్తలేదు. అలాగే టీడీపీ హయాంలో గాజులపల్లి షాదిఖానాకు రూ.50లక్షలు మంజూరు చేయిస్తే ఆ పనులను వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేపట్టలేదు. అలాగే మహానంది మండలంలో నష్టపోయిన అరటి తోటలకు ఎమ్మెల్యే నష్టపరిహారం ఇప్పించలేకపోయారు. అరటి కోల్డ్ స్టోరేజ్ గోదాము నిర్మిస్తానని చెప్పి విస్మరించారు. పసుపు, అరటి పంటల సాగుకు అవసరమయ్యే డ్రిప్ ఇరిగేషన్‌కు ఎలాంటి ప్రోత్సాహాన్ని అందించలేకపోయారు. ప్రత్యేకించి మహానందిలో క్షేత్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలను స్థానికులకు కాకుండా కడప జిల్లావాసులకు కేటాయించి ఇక్కడి నిరుద్యోగులకు అన్యాయం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెలుగోడు మండల హామీలు ఏమయ్యాయి..

వెలుగోడులోని షాదిఖానాను సొంత నిధులు ఖర్చు చేసి పూర్తి చేయిస్తానని చెప్పి ఇంతవరకు పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఈద్గా నిర్మాణానికి పది ఎకరాలు స్థలాన్ని ఇచ్చారు. అయితే ఈద్గా చుట్టూ ప్రహరీ కట్టిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే శిల్పా ఈ విషయాన్ని విస్మరించారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో మైనార్టీలకు కస్తుర్బా స్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, పీజీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ మంజూరయ్యాయని చెప్పారే తప్ప చేసింది లేదు. వెలుగోడులోని మర్కస్ మసీదు, రోఖియాబీ దర్గా నిర్మాణం కోసం రూ.2 కోట్లు ప్రభుత్వంతో మంజూరు చేయిస్తానని చెప్పినా ఇంతవరకు ఒక్క పైసా నిధులు రాలేదు. గుంతకందాల ఆయకట్టుకు వన్‌ఆర్ తూము నుంచి సాగు నీరందిస్తానని హామీ ఇచ్చి పూర్తి చేయలేదు.

షాదిఖానాల నిర్మాణంలోనూ అదే నిర్లక్ష్యం



ఆత్మకూరులోని షాదిఖానా దుస్థితి ఇలా

ఆత్మకూరు పట్టణంలోని ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో అత్యాధునిక హంగులతో షాదిఖానాను నిర్మించేందుకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సంకల్పించారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన పీఅండ్‌పీ ఆర్కిటెక్ సంస్థ ద్వారా ప్రత్యేక డిజైన్‌ను రూపొందించారు. టీడీపీ హయాంలో లెంటల్ లెవల్ వరకు పనులు పూర్తికాగా ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో నాలుగున్నరేళ్ల పాటు షాదిఖానా నిర్మాణ పనులు ముందుగు సాగలేదు. చివర్లో ఎన్నికలు దగ్గరపడటంతో పైన పటారం లోన లొటారం అన్నట్లుగా హడావిడిగా పనులు చేసి ఈ ఏడాది మార్చి 3న ప్రారంభించారు. కాగా షాదిఖానా భవన నిర్మాణాన్ని కాంక్రీట్ స్లాబ్‌తో నిర్మించాల్సి ఉండగా రేకులతో కప్పివేశారు. వసతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదు. ల్యాండ్ స్కేప్‌తో కూడిన ఉద్యానవనాల జోలికే వెళ్లలేదు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో మిగిలిన పనులను నాసిరకంగా పనులు పూర్తి చేశారన్న విమర్శలు ఉన్నాయి.

ఎత్తిపోయిన వీఆర్ఎస్పీ ఎత్తిపోతల పథకం..!

ఆత్మకూరు మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో గల మునిమడుగుల వాగుపై వరదరాజ స్వామి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. అయితే అనేక సెంటిమెంట్లతో 2012 నవంబరు 28వ తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లోని 13 గ్రామాల్లో పరిధిలోని 12,092 ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారితం. ఈ నేపథ్యంలో శ్రీశైలం జలాశయం నుంచి వీఆర్ఎస్పీకి కృష్ణా జలాలను ఎత్తిపోసేలా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తానని గత ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్లలో ఆయన ఏనాడు ప్రాజెక్టు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. ఇటీవల నిధులు లేకపోవడం వల్ల వీఆర్ఎస్పీ ప్రాజెక్టును చేయలేకపోయానని ఆయన సమర్థించుకున్నారు. ఇదిలావుంటే టీడీపీ హయంలోనే నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేశారు. జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) సంస్థ ద్వారా సుమారు రూ.19.5కోట్ల నిధులను మంజూరు చేయించి ప్రాజెక్టు అభివృద్ధికి చొరవ తీసుకోవడం గమనార్హం.



ఉత్తుత్తి హామీగానే మిగిలిన వీఆర్ఎస్పీ ఎత్తిపోతల పథకం

నత్తనడకన నాన్ అమృత్ వాటర్ స్కీం

కృష్ణానది జలాల పరవళ్లు చెంతనే ఉన్నప్పటికీ ఆత్మకూరు పట్టణవాసులకు మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతవాసులు తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆత్మకూరులో మరో 50 ఏళ్లలో జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను తీర్చాలన్న సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రూ.116.83 కోట్లతో నాన్ అమృత్ స్కీంను మంజూరు చేయించారు. 2019 ఫిబ్రవరి 18న ఈ పథకానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఇందులోభాగంగా వీబీఆర్ నుంచి గుంతకందాల, వేంపెంట, భానకచర్ల, భానుముక్కల టర్నింగ్ మీదుగా కరివేన వరకు 22 కి.మీ. దూరంలో భారీ లైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. అలాగే కరివేన వద్ద రెండు ఎకరాల స్థలంలో వీబీఆర్ నుంచి వచ్చిన నీటిని ఫిల్టర్‌బెడ్స్ ద్వారా శుద్ధి చేసేందుకు వివిధ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే ఆత్మకూరులో ఐదు చోట్ల లక్ష లీటర్ల సామర్థ్యం గల ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను నిర్మించి పట్టణానికి నీటి సరఫరా చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఐదేళ్లలో ఇప్పటి వరకు ఒక్క వాటర్ ట్యాంకు నిర్మాణం కూడా పూర్తి కాలేదు. అలాగే వీబీఆర్ నుంచి ఆత్మకూరుకు వచ్చే పైపులైన్ పనుల జోలికే వెళ్లలేదు.



ఐదేళ్లుగా నాన్ అమృత్ వాటర్ స్కీంలో పూర్తికాని ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు

బండి ఆత్మకూరు మండలానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?

బండిఆత్మకూరు - ఓంకారం మధ్య రూ.17 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి 20 శాతం పనులు పూర్తి చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను దక్కించుకుని ఇప్పటికీ పూర్తి చేయలేదు. అలాగే టీడీపీ హయాంలో 18 కి.మీ. మేర తెలుగుగంగ కాల్వ లైనింగ్ పనుల నిర్మాణ పనులకు రూ.289 కోట్లు మంజూరు చేశారు. అయితే నేటికీ ఆ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. తెలుగుగంగ లైనింగ్ పనుల పేరిట మూడేళ్లుగా ఆయకట్టు రెండో పంటకు నీరందించలేని పరిస్థితి. అలాగే నారపురెడ్డి కుంటలో చెంచులకు ఉన్న 60 ఎకరాల భూమికి నీరందించాలని ఎమ్మెల్యే శిల్పాకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. శిల్పా సొంత బంధువుల గ్రామమైన యర్రకుంట్ల రోడ్డును పట్టించుకున్న పరిస్థితి లేదు.

శ్రీశైలానికి ఇచ్చిన హామీలు మల్లన్నకే ఎరుక

శ్రీశైలంలోనే ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. గత టీడీపీ హయాంలో రూ.350 కోట్లతో శ్రీశైల క్షేత్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే శిల్పా హయాంలో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. పైగా టీడీపీ హయాంలో రూ.80కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడితే అది తానే చేపట్టినట్లు ప్రచారం చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. సున్నిపెంటకు సంబంధించి వాటర్ స్కీం పథకానికి టీడీపీ హయాంలో రూ.17 కోట్లను మంజూరు చేస్తే వైసీపీ వచ్చాక పైసా నిధులు కూడా రానట్లు తెలుస్తోంది. అలాగే సున్నిపెంటలో ఒక్క రోడ్డు మినహాయిస్తే ఎక్కడా అంతర్గత రోడ్ల నిర్మాణం జరగలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రత్యేకించి తాను గెలిస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చి నేడు శ్రీశైలంలో కడప, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే వాటర్ బోర్లు, ఇంటింటి కుళాయిల ఏర్పాటు చేస్తానని వాటి జోలికే వెళ్లలేదు.

ఆ మద్యం విలువ రూ.అరకోటి

- వివరాలను వెల్లడించిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం/మహానంది, మే 4: నంద్యాల జిల్లా గాజులపల్లె చెక్‌పోస్ట్ శుక్రవారం పట్టుబడిన మద్యం విలువ రూ. అరకోటికిపైనే ఉంటుందని ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర పూణే జిల్లా నాన్‌పేట్‌దుర్గా నివాస్ ప్రాంతానికి చెందిన జితేంద్రరాజ్‌కుమార్ గిద్వానీ, మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయిని జిల్లా నగడ గ్రామానికి చెందిన రాజేష్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులు లారీలో మద్యం తరలిస్తున్నారు. నంద్యాల స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారంతో నంద్యాల డీఎస్పీ ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల రూరల్ సీఐ ఎన్. శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్సై జి. నాగేంద్రప్రసాద్, బండిఆత్మకూరు ఎస్సై కె.మల్లికార్జున, ఎస్ఎస్‌టి టీం, చెక్‌పోస్ట్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం 6.15 ప్రాంతంలో లారీని పట్టుకున్నారు. మహానంది మండలం నంద్యాల-గిద్దలూరు రహదారిలో ఆంజనేయకొట్టాల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద నిందితులు లారీ ట్రక్కులో ఎన్‌డీపీఎల్ మద్యాన్ని గోవా నుంచి విజయవాడకు రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. 888 బాక్సులు రాయల్ బ్లూ మాల్ట్‌విస్కీ, 12బాక్స్‌లు గోవా విస్కీ బాటిళ్లు మొత్తం 900 బాక్స్‌లు ఉన్నాయి. అన్ని బాక్సుల్లో కలిపి 43,200 బాటిళ్లు పట్టుబడ్డాయి. ఒక్కొక్క లీటర్ రూ.700చొప్పున పట్టుబడిన మద్యం విలువ మొత్తం రూ.54,43,200 ఉంటుంది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి మద్యంతోపాటు రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించండి



మాట్లాడుతున్న దీపక్ మిశ్రా, శంఖబ్రత బాగ్చి

నంద్యాల (కల్చరల్), మే 4: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల విధులను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని పోలీసు స్పెషల్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల నిర్వహణ, భద్రతా చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఏదో ఒక పార్టీకి సపోర్టు చేయకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నేర చరిత కలిగిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడమే కాకుండా వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠినంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎం యంత్రాలను తరలించే వాహనాలు మధ్యలో ఎక్కడా ఆగకుండా నేరుగా స్ట్రాంగ్ రూమ్‌కే చేర్చాలని ఆదేశించారు. పైలట్ కాన్వాయ్ వెనుక రివర్స్ కెమెరా ఉండాలని, యంత్రాలను తరలించే వాహనాల దృశ్యాలను పూర్తిగా రికార్డు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, ఎన్నికల సాధారణ పరిశీలకులు పంకజ్‌కుమార్, పోలీసు పరిశీలకులు హిమాన్షు శంకర్ త్రివేది, కర్నూలు రేంజ్ డిఐజీ సీహెచ్ విజయారావు, ఎస్పీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు నీట్ ప్రవేశ పరీక్ష

- కర్నూలులో 7 పరీక్ష కేంద్రాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 4: వైద్య, విద్య కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఆదివారం నీట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేటప్పుడు అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు రెండు ఫొటోలు, వికలాంగుల అభ్యర్థులైతే ఫిజికల్ హ్యాండ్ సర్టిఫికెట్ ధృవీకరణ పత్రాన్ని తప్పకుండా తీసుకువెళ్లాలి. కర్నూలు నగరంలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక హోదా తీసుకొస్తాం

- జగన్‌ను తరిమికొట్టండి
- కాంగ్రెస్ నేత ఎన్.తులసి రెడ్డి

ఉయ్యాలవాడ, మే 4: దేశంలో యూపీఏ కూటమి ఏర్పాటైన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఉయ్యాలవాడ గ్రామంలో నంద్యాల ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో తులసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి నాశనం చేశాడన్నారు. ఐదేళ్ల పాలనలో అన్నీ విధ్వంసాలే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డిని తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళకు ఏడాది రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చారు. గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అళ్లగడ్డ కాంగ్రెస్ అభ్యర్థి బరగొడ్ల హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న తులసిరెడ్డి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



లింగారెడ్డి (ఫైల్)

కొత్తపల్లి, మే 4: కొత్తపల్లి మండలం సింగరాజుపల్లె గ్రామానికి చెందిన మద్దిరాళ్ల లింగారెడ్డి (40) అనే రైతు అప్పుల బాధతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చంద్రారెడ్డి కుమారుడైన లింగారెడ్డి శుక్రవారం సాయంత్రం మండలంలోని నందికుంట గ్రామ శివారులో క్రిమిసంహారక మందు తాగానని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు లింగారెడ్డిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొత్తపల్లి ఏఎస్ఐ ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. సొంత పొలం నాలుగు ఎకరాలు, కౌలుకు ఏడు ఎకరాలు తీసుకొని మొక్కజొన్న, మినుము సాగు చేశారు. వ్యవసాయంలో తీవ్రంగా నష్టాలు రావడంతో సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యాయత్నం చేశాడు. మృతుని భార్య భారతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మద్యంపై నేతల కన్ను

- మందుకు మహా డిమాండ్
- పోలింగ్‌కు సమీపిస్తున్న గడువు
- లిక్కర్ నిల్వలకు ఇప్పటికే ఏర్పాట్లు
- ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లకు ప్రయత్నాలు



ఆదోని, మే 4: ఈనెల 13న శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మద్యం పంపిణీపై నేతలు దృష్టి సారించారు. ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు జరిగినప్పుడు మద్యం కీలకం కావడంతో ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని మద్యం షాపులు, బెల్టు షాపుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా మద్యం ఎక్కువగా ఉపయోగించనుండటంతో అన్ని పార్టీల నేతలు దీనిపైనే దృష్టి పెట్టారు. దీంతో షాపుల యజమానులు కూడా ఖరీదుకంటే ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు.

● లిక్కర్ వినియోగమే అధికం....

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిసారి మద్యం వినియోగం ఎక్కువగా జరుగుతోంది. శాసనసభ ఎన్నికల్లో మద్యం వినియోగం పెరగడం వల్ల అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. ప్రతి ఎన్నికల్లో నెలరోజుల పాటు సగటున జరిగే అమ్మకాల కంటే 20నుంచి 30శాతం ఎక్కువగా జరుగుతాయి.

● బెల్టు షాపులతో..

ఈ ఎన్నికల్లో మద్యం షాపులతో పాటు బెల్టుషాపులు నేతలకు కలిసి వస్తున్నాయి. ముందే మద్యం నిల్వల కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న అభ్యర్థి వీరితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వారికి కావాల్సిన మద్యం కర్ణాటక ప్రాంతాల నుంచి ముందు జాగ్రత్త చర్యగా రాత్రికి రాత్రే ప్రత్యర్థుల మధ్య నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పట్టుబడితే ఏదో ఒక మద్యం కేసుల్లో ఉన్న వ్యక్తిని ఏర్పాటు చేసి అతనిపై కేసు పెట్టుకోవాలంటూ అధికార పార్టీ నాయకులు పోలీసులకు హుకుం జారీ చేస్తున్నట్లు పేరు చెప్పని ఓ ఎక్సైజ్ పోలీసు అధికారి తెలిపారు. కర్ణాటక నుంచి వచ్చిన మద్యాన్ని ఎన్నికల సమయంలో జరిగే ప్రచారాల కోసం వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల గడువు కూడా ఎక్కువగా లేకపోవడంతో ఇప్పటికే అభ్యర్థులు మద్యం నిల్వల ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల రోజుకు మూడు రోజుల ముందే మద్యం షాపులను బంద్ చేయనుండటంతో ముందస్తుగానే మద్యం సేకరణకు చర్యలు చేపట్టారు. దీంతోపాటు ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యంతోపాటు నగదు కూడా ఎక్కువ మొత్తంలో అవసరాన్ని కాబట్టి ఇప్పటి నుంచే అందుబాటులో ఉంచేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.

చాయ్‌వాలా



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ వినూత్న రీతుల్లో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఇందులోభాగంగానే శనివారం నగరంలోని మార్కెట్‌యార్డులో పర్యటించారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణదారులు, కూరగాయల వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చిన వారిని పలకరించారు. అనంతరం వెంకటరమణ కాలనీలోని పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు. అక్కడే ఉన్న టీ కొట్టులో చాయ్ తయారు చేసి అందర్నీ ఆకర్షించారు. అనంతరం పెద్దలు, యువకులతో మాట్లాడి టీడీపీని గెలిపించాలని కోరారు. - కర్నూలు అర్బన్

చెంచులకు భరోసా



శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రచారం పర్వాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై టీడీపీని గెలిపించాలని కోరుతున్నారు. ఇందులోభాగంగానే శనివారం ఆత్మకూరు మండలంలో బైర్లూటి గ్రామంలో పర్యటించారు. స్థానిక చెంచు మహిళలతో కలిసి కింద కూర్చున్న ఆయన వారు చెప్పే సాదకబాదకాలను ఓపిగ్గా విన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. -ఆత్మకూరు

చెప్పులు కుడుతూ..



ఎన్నికల ప్రచార పర్వంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేలా తమ ప్రచారాన్ని సాగిస్తున్నారు. తాజాగా నంద్యాల పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న జె.లక్ష్మీనరసింహ యాదవ్ చెప్పులు కుడుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని బనగానపల్లె పట్టణంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని ఓ దళితుడి వద్దకు వెళ్లి దాదాపు అరగంట సేపు ఇలా ప్రజల పాదరక్షలు కుడుతూ ఓటర్లను ఆకర్షించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే రాహుల్‌గాంధీ సంతకం చేస్తారని ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహయాదవ్ చెప్పుకొచ్చారు. - బనగానపల్లె

లాక్కునే చట్టం



- కర్నూలు కలెక్టరేట్


వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2023 పైన రాష్ట్రంలోని న్యాయవాదులు కూడా నిరసన వ్యక్తం చేశారు. భూహక్కు చట్టం - ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 27ను జీవో 512 ద్వారా అక్టోబరు 31 నుంచి అమలు చేశారు. రాష్ట్రంలోని ప్రజలు స్థిరాస్థులు, భూమి వివాదాలు పరిష్కార కోసం సివిల్ కోర్టులకు వెళ్లకుండా ఆ స్థానంలో ట్రిబ్యునల్ కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది.

● ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలుపై విమర్శలు ● వైసీపీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

టైటిల్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికే ఆ భూమిని పూర్తిగా విక్రయించే అధికారం ఉంటుంది. ఒకవేళ భూమిపై వివాదం ఉంటే టైటిల్ రిజిస్టర్‌లో పేరు నమోదైన రెండేళ్లలోపు వివాదంపై కేసు నమోదు అవకాశం ఉంటుంది. ఆ కేసు జిల్లా స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అధికారులు లేదా జాయింట్ కలెక్టర్ వద్ద కేసు దాఖలు చేయాలి.

6 నెలల పాటు జైలు, రూ.50 వేల జరిమానా

లేదంటే ఆ భూమిని శాశ్వత భూ యజమాని కోల్పోతాడు. సమస్య పరిష్కారమయ్యే వరకు భూముల క్రయవిక్రయాలు జరగవు. సదరు భూముల్లో నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. రికార్డు ప్రకారం భూమిని నమోదు చేసుకుని సమాచారం తప్పని రుజువైతే.. ఆరు నెలల పాటు జైలు శిక్ష రూ.50 వేలు జరిమానా విధిస్తారు.



ఓల్డ్ పాసు పుస్తకం

● ఏపీ ల్యాండ్ అథారిటీ

రాష్ట్రంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి నేతృత్వంలోని ఏపీ ల్యాండ్ అథారిటీ పని చేస్తుంది. ఏపీ ల్యాండ్ అథారిటీ కేంద్రం టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఆర్‌వో), మండల స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ అధికారి (ఎల్‌టీవో) ఉంటారు. రికార్డు ఆఫ్ టైటిల్స్‌లో ఒకసారి యజమాని పేరు నమోదు చేశాక.. రెండేళ్లలోపు ఎవరూ అభ్యంతరం చెప్పకపోతే ఆ యజమాని భూహక్కుదారు అవుతారు.



● భూ కబ్జాలకు అవకాశం

ఈ చట్టం కబ్జాలకు పాల్పడే వ్యక్తులు, కార్పొరేట్లకు భూములు ధారాదత్తం చేసేవిధంగా వైసీపీ ప్రభుత్వం రూపొందించిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు, దళిత గిరిజన భూములను మోసం చేయడానికి ఈ భూహక్కు చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకవచ్చిందని ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోర్టులో కేసులు వేయలేని నిబంధనలను అమలు చేడయం పట్ల వైసీపీ ప్రభుత్వం దాష్టీకానికి నిదర్శనమని అభిప్రాయపడుతున్నారు.



● సెక్షన్-7 ప్రకారం నమోదు చేసుకోవాలి:

రాష్ట్రంలోని ప్రజలందరూ ఆస్తి వివరాలు, వివాద స్థిరాస్థులు, భూములను సెక్షన్ 7 ప్రకారం తప్పనిసరిగా టైటిల్ రిజిస్ట్రేషన్ వద్ద నమోదు చేసుకోవాలి.



● 30 రకాల రికార్డులు కనుమరుగు:

భూ హక్కు చట్టం-ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2023 వల్ల ఇప్పటి వరకు భూములకు ఉన్న పాసు పుస్తకం, టైటిల్ డీడ్, అడంగల్, 1బీ లాంటి 30 రకాల రికార్డులు కనుమరుగవుతాయని అధికారులు చెబుతున్నారు.

రైతుల ఆందోళన

ఈ చట్టం ప్రకారం ఆస్తులపై సివిల్ కోర్టులో కాకుండా ట్రిబ్యునల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేయాలి. ఒకవేళ ట్రిబ్యునల్ కోర్టులో న్యాయం జరగని పక్షంలో హైకోర్టుకు వెళ్లాలి. ప్రతి రైతు హైకోర్టుకు వెళ్లారన్నది ప్రశ్నార్థకమే. వైసీపీ ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్న దానికి ఇది ఒక నిదర్శనమనే రైతులు స్పష్టం చేస్తున్నారు.



● ప్రజా ధనం వృథా

గ్రామాల్లో గ్రామ సచివాలయం అధికారులు జగనన్న భూసర్వే చేపట్టారు. భూసర్వే చేసిన చాలా గ్రామాల్లో ఇప్పటికి సరిహద్దు రాళ్లు పాతలేదు. భూ సమస్యలను పరిష్కరించలేదు. పట్టాదారు పుస్తకంలో భూ యజమాని ఒకరైతే.. ఫొటో మరొకరిది ప్రచురిస్తున్నారు. అంతా తప్పుల తడకగా ఉంది. రైతులు చాలా మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వివాదాలు పరిష్కారం కాకపోతే హైకోర్టుకు రైతులు వేళ్లే పరిస్థితి లేదు.

- రవి, రైతు

ఎన్నికల విధుల్లో బాధ్యతగా ఉండండి

● స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా

కర్నూలు(కలెక్టరేట్), మే 4: ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించడంతోపాటు ఎన్నిల విధుల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలని పోలీసు స్పెషల్ అబ్జర్వర్ దీపక్‌మిశ్రా పోలీసు అధికారులను సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణ, భద్రతా చర్యలపై స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్) శంఖబ్రత బాగ్చి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనరల్ అబ్జర్వర్ జాఫర్ మీర్ తారీఖ్ అలి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పోలీసు పరిశీలకులు ఉమేష్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియా పాల్గొన్నారు. సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఎస్‌డీపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ స్పెషల్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా

రెండోసారి ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి

కర్నూలు(కలెక్టరేట్), మే 4: కర్నూలు పార్లమెంటరీ స్థానానికి సంబంధించి రెండో ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి చేశామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కర్నూలు పార్లమెంటు బ్యాలెట్ యూనిట్లకు రెండో విడత ఈవీఎం ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఈసీఐ సాఫ్ట్‌వేర్ ద్వారా మూడు రౌండ్లు నిర్వహించి మూడవ రౌండ్‌ను ఫైనల్ చేశామన్నారు. సమావేశంలో జనరల్ అబ్జర్వర్లు జాఫర్ మీర్ తారీఖ్ అలి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, డీపీవో నాగరాజు నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.



ఇక వారం రోజులే..!

- దగ్గర పడుతున్న ప్రచారం సమయం
- స్పీడ్ పెంచిన పార్టీలు

నందికొట్కూరు, మే 4: ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులే మిగిలి ఉంది. సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీలు స్పీడ్ పెంచాయి. అభ్యర్థులు తమ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో వివరిస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు. మేనిఫెస్టోలోని హామీలతో పాటు స్థానికంగా ఉండే సమస్యలను ప్రచారాస్త్రాలుగా చేసుకుని ముందుకు సాగుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. వైసపీ మేనిఫెస్టో పేలవంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు డీలా పడుతున్నారు. దీనికి తోడు వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నాయకులు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారం సాగిస్తున్నారు. ప్రస్తుతం విజయావకాశాలు కూటమికే ఉన్నాయని తెలుస్తుండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ నాయకులు ఆపసోపాలు పడుతున్నారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమైన ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు నిరుద్యోగ భృతి వంటి అంశాలపై అభ్యర్థులు దృష్టి సారించారు. ఇవేగాకుండా చంద్రబాబుకు ఉన్న ఐటీ బ్రాండ్‌ను కూడా అభ్యర్థులు లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు.

పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు

అభ్యర్థులు పగలంతా ప్రచారం చేస్తున్నారు. రాత్రి చేరికలు తదితర అంశాలపై మంతనాలు సాగిస్తున్నారు. బూత్‌ల వారీగా సమీక్షలతో పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్లు జాతరను తలపిస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రధాన పార్టీల తరఫున రాష్ట్ర స్థాయి నాయకులు ప్రచారానికి వచ్చి వెళ్తుండడంతో ఆయా పార్టీల శ్రేణుల్లో గెలుపు ధీమా మరింత పెరుగుతోంది.





● కూటమి అధికారంలోకి వస్తే..

తాము అధికారంలోకి వస్తే ఏళ్లుగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కూటమి నాయకులు హామీ ఇస్తున్నారు. కొద్ది రోజుల కిందట వరకు పార్టీ అభ్యర్థి మాత్రమే ప్రచారం చేసేవారు. ప్రస్తుత సమయం దగ్గర పడుతుండడంతో పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకులకు గ్రామాల వారీగా ప్రచార బాధ్యతలను అప్పగించారు. ప్రచారంలో భాగంగా ఇప్పటి వరకు టచ్ చేయని ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో పాటు, ప్రతికూలత ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ప్రచారం చేయాలని నాయకులు అంచనాకు వచ్చారు. పార్టీ తరఫున నియోజకవర్గాల్లో ఉన్న పరిశీలకుల సూచనలు, సలహాలు కూడా పాటిస్తూ అభ్యర్థులు దూకుడు పెంచారు.



● సోషల్ మీడియాపైనా దృష్టి..

సమయం తక్కువగా ఉండడంతో కోడ్ నిబంధనల మేరకు సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా నాయకులు దృష్టి సారించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బృందాన్ని కొంత మంది అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టి సారించారు.

● ముఖ్య నేతల తాకిడి

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాకు ప్రచారాని వచ్చే రాష్ట్రస్థాయి నేతల తాకిడి ఎక్కువైంది. ఇటీవల నందికొట్కూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ, కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డిలు రోడ్డు షోలు నిర్వహించారు. ఈ వారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. అయితే తేదీలు ఖరారు కావాల్సి ఉంది.

● కూడికలు, తీసివేతలతో బిజీబిజీ..

అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. వారి వారి పార్టీలు నియోజకవర్గాల వారీగా నియమించిన పరిశీలకులు పంచాయతీలు, బూత్‌లు వారీ బలాబలాలను లెక్కలు వేస్తున్నారు. ప్రతి రోజూ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై అధిష్టానానికి నివేదిక ఇస్తున్నారు. పరిశీలకులు అభ్యర్థులతో సమానంగా పని చేస్తూ వారి గెలుపు కోసం తెరవెనుక వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయ్యారు.





గుంతలు పడిన మద్దికెర-బురుజుల రోడ్డు

అడుగుకో గుంత..

- ప్రయాణమంటే చింత
- భూమి పూజకే పరిమితమైన వైసీపీ

మద్దికెర, మే 4: గడిచిన ఐదేళ్ల పాలనలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి.. అడుగుకో గుంతతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. వాటికి మరమ్మతుల పేరుతో రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించుకుని తూతూ మంత్రంగా మరమ్మతులు పనులు చేసి వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్దికెర నుంచి బురుజుల మీదుగా పత్తికొండకు వెళ్లే రోడ్డు సుమారు 10 కి.మీ. పొడవునా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. రాత్రివేళల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వైసీపీ నాయకులు మరమ్మతుల కోసం రూ.46 లక్షలు మంజూరు చేయించుకోగా.. రూ.10 లక్షలు జీఎస్టీ పోగా.. రూ.36 లక్షలు బిల్లులు చేసుకుని కాజేశారు. బురుజుల నుంచి మద్దికెర నంచర్ల సరిహద్దు వరకు రూ.5 కోట్లు మంజూరు చేయగా.. వైసీపీ నాయకులు అట్టహాసంగా భూమి పూజ చేశారు. కాంట్రాక్టు పొందిన సదరు వ్యక్తి తూతూ మంత్రంగా రోడ్డుకిరువైపులా ముళ్లకంపలను తొలగించారే తప్ప.. పనిమాత్రం ఇంత వరకు చేయలేదు. ఎమ్మెల్యే కె.శ్రీదేవి మాత్రం రోడ్డు కోసం నిధులు మంజూరు చేశామని చెప్పుకొంటున్నారు. దీంతో బురుజుల, మద్దికెర, నెంచర్ల రోడ్డు అధ్వానంగా తయారు అయ్యాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు..

● మరమ్మతుల పేరుతో కాజేశారు



మద్దికెర నుంచి బురుజుల వరకు మరమ్మతుల పేరుతో నిధులు కాజేశారు. పాలకులు హామీలు ఇస్తారే తప్ప.. ఇంత వరకు రోడ్డు వేయలేదు. ఆ రహదారి గుండా వెళ్లలేక పత్తికొండ నుంచి వయా తుగ్గలి పెరవలి మీదుగా మద్దికెరకు చేరుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు భూమి పూజలకే పరిమితం కాకుండా వెంటనే పనులు చేయాలి.

\- చంద్రమోహన్, మద్దికెర



అధ్వానంగా ఉన్న మద్దికెర-నెంచర్ల రోడ్డు



చేనేత పురి ఎవరిదో..?

- ఆవిర్భావం నుంచి టీడీపీకి కంచుకోట ● ఈసారి బీవీ, బుట్టా రేణుక మధ్య పోటీ



కర్నూలు, మే 4 (ఆంధ్రజ్యోతి)/ ఎమ్మిగనూరు:

ఎమ్మిగనూరులో ఈసారి ఎవరు విజేత అవుతారనే చర్చ జోరుగా సాగుతోంది. టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బుట్టా రేణుక పోటీలో ఉన్నారు. టీడీపీ, వైసీపీ మధ్యనే హోరాహోరీ పోరు నడుస్తోంది. 1955లో ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ ఎన్నికల్లో ద్విసభ్యులుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, దామోదరం సంజీవయ్య ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ ఇద్దరూ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేశారు.

● టీడీపీకి కంచుకోటగా ఎమ్మిగనూరు:

టీడీపీ ఆవిర్భావంతో ఎమ్మిగనూరు ఆ పార్టీకి కంచుకోటగా మారింది. 1983లో ముఖ్యమంత్రి హోదాలో పోటీ చేసిన కోట్ల విజయభాస్కరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. అదే ఏడాది వచ్చిన ఉప ఎన్నికలో ఎన్టీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బీవీ మోహన్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డిపై 6,639 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆ గెలుపుతో మొదలైన బీవీ విజయకేతనం 1999 వరకు కొనసాగింది. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించారు. ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో ఆరు పర్యాయాలు మున్సిపల్ శాఖ, రోడ్లు భవనాలు.. వంటి కీలకమైన మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బరిలో దిగితే.. వైసీపీ అభ్యర్థిగా బుట్టా రేణుక తొలిసారిగా పోటీ బరిలో దిగారు. పీఠం నీదా.. నాదా అంటూ బీవీ, బుట్టాలు ప్రచారంలో దూకుడు పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాశీంవలీ పోటీ చేశారు.



● నియోజకవర్గ స్వరూపం

- నియోజకవర్గం పరిధిలో ఎమ్మిగనూరు పట్టణం, రూరల్ మండలం, నందవరం, గోనెగండ్ల మండలాలు ఉన్నాయి
- పోలింగ్ కేంద్రాలు : 271
- మొత్తం ఓటర్లు : 2,44,818
- పురుష ఓటర్లు : 1,20,608
- మహిళా ఓటర్లు : 1,24,163
- థర్డ్ జెండర్ : 47



బీవీ బలాలు..

మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గం ప్రజలకు సుపరిచితుడు కావడం. ఆయన తండ్రి దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి. చేనేత, ఉప్పర, వాల్మీకి సామాజికవర్గాలు పార్టీకి అండగా ఉండడం, జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత.

● బలహీనతలు..:

\- కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం. సీనియర్లకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడం.

బుట్టా రేణుక బలాలు..

తన సామాజికవర్గానికి చెందిన చేనేతల ఓటర్లు ఎక్కువగా ఉండడం.. డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందనే ప్రచారం..

● బలహీనతలు..:

\- నియోజకవరానికి కొత్త కావడం. 2014లో ఎంపీగా నాగులదిన్నె గ్రామాన్ని దత్తత తీసుకున్నా.. ఆ గ్రామంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేయకపోవడం. ఎర్రకోట వర్గీయులను దూరం పెట్టడం.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఎలా?



కర్నూలు(న్యూసిటీ), మే 4: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముందుగా నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ కోసం రంగం సిద్ధమైంది. 6,7,8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై జిల్లా ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఆయా అసెంబ్లీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా...

- 13-ఏ- డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ సీరియర్ నెంబరు నమోదు చేయవలెను.
- డిక్లరేషన్‌లో ఓటరు తప్పక సంతకం చేయాలి
- డిక్లరేషన్‌పై అటెస్టేషన్ తప్పనిసరిగా చేయాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరుకు సంబంధించి ఎంపిక ఇవ్వబడిన స్థలంలో టిక్ (మార్కు) గాని ఇంటూ (ఇంటూ మార్కు) మార్కుగాని పెట్టాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై సంతకం, పేర్లు రాయడం చేయకూడదు.
- ఓటు నమోదు చేసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్‌ను 13-బీ కవర్‌లో పెట్టి అతికించాలి
- 13-బీ కవర్‌పైన పోస్టల్ బ్యాలెట్ సీరియర్ నెంబర్ తప్పనిసరిగా రాయాలి
- 13-బీ కవర్‌ను, డిక్లరేషన్ 13-సి కవర్‌లో ఉంచి సీల్ వేయాలి
- 13-సీ కవర్‌ను సంబంధిత బ్యాలెట్ బాక్స్‌లో వేయాలి.

బీప్ సౌండ్ వస్తేనే ఓటు పడినట్లు..!



కర్నూలు(న్యూసిటీ), మే 4: ఓటర్లు పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కినప్పుడు బీప్ శబ్దం గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లుగా భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు. మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో వారు ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో వారు ఓటరు చేతి వేలికి ఇంక్ మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దనే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అదినొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మోనిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇది కూడ రిగ్గింగ్‌లో ఓ భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోతారు. తరువాత బూత్‌లో ఉన్న వారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు.

కొండమనాయినిపల్లెలో టీడీపీ తొలిసారి ప్రచారం



కొండమనాయినిపల్లెలో కరపత్రాలు పంపిణీచేస్తున్న టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి తదితరులు

అవుకు, మే 4: ప్రతి ఎన్నికల్లో రిగ్గింగ్, రీసైక్లింగ్ నిర్వహించే అవుకు మండలం కొండమనాయినిపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు తొలిసారి ప్రచారం నిర్వహించారు. ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. 40 ఏళ్లుగా చల్లా కుటుంబీకుల ఆధిపత్యంలో నడిచిన కొండమనాయినపల్లెలో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ ప్రచారం నిర్వహించి రికార్డు సృష్టించారు. గ్రామంలోని యువకులు భారీగా తరలివచ్చి ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమ నాయకులు సీమకృష్ణ, టీడీపీ నాయకులు సుబ్బయ్య, చిన్నబాలసుంకన్న, భూపడు, మల్లేశ్‌యాదవ్, రాజశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలూరులో వరుస విజేతలు వీరే...



మారెప్ప



జయరాం

దేవనకొండ, మే 4: జిల్లాలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో వరుసగా రెండుసార్లు గెలిచిన ఎమ్మెల్యేల జాబితాలో ఇద్దరు చోటు సంపాదించుకున్నారు. ఒకరు మూలింటి మారెప్ప 1999, 2004 ఎన్నికల్లో గెలిచారు. మరొకరు గుమ్మనూరు జయరాం 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇందులో విశేషం ఏమిటంటే వరుసగా రెండుసార్లు గెలిచిన వీరిద్దరినీ మంత్రి పదవులు వరించాయి.

సెక్షన్.. తప్పదు యాక్షన్



కర్నూలు, మే 4: ఎన్నికల నియామావళిని ఎవరు అతిక్రమించినా ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తుంటారు. ప్రచారంలో పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అదుపుతప్పి వ్యవహరిస్తే దండన తప్పదు. సామాన్య పౌరులు సైతం ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో కొన్ని ఎన్నికల చట్టాల గురించి అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.. అవేమిటంటే..

- **సెక్షన్ 122 :** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడికిలోను చేయడం చేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.
- **సెక్షన్ 125 :** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో ఈ రెండింటిని కూడా విధించే అవకాశం ఉంది.
- **సెక్షన్ 126:** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 127:** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఈ సెక్షన్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 128:** బహిరంగంగా ఓటేసినా మూడు నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 129:** ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీ చేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. ఇందుకు మూడు నెలలు జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 130:** పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల లోపల ప్రచారం చేయకూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 131:** పోలింగ్ కేంద్రానికి సమీపంలో నియమాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారైనా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ కేసుకు మూడు నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో రెండు కూడా విధించవచ్చు.
- **సెక్షన్ 132:** ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించని వారికి మూడు నెలల జైలు శిక్ష జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 134 :** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 134(బీ):** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి రెండు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 135 :** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలు శిక్ష జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 135(బీ):** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటుగాగానీ, పోలింగ్ ఏజెంటుగా గానీ, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగానీ వ్యవహరిస్తే శిక్షార్హులు. ఇందుకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 49(సీ):** ఒక వ్యక్తి ఓటు మరో వ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటరు 49(సీ) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. దీంతో ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలు శిక్ష విధిస్తారు.

తొలిసారి హోం ఓటింగ్



కర్నూలు(కలెక్టరేట్), మే 4: గతంలో జరిగిన ఏ ఎన్నికల్లో అయినా ఓటు హక్కు ఉన్న వృద్ధులు విధిగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే వారు పోలింగ్ కేంద్రాలకు రావడం ఒక ఎత్తయితే.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేయడం పెద్ద ప్రయాసగా మారడంతో పాటు వివిధ రకాల సమస్యలు తలెత్తేవి. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం నెలకొనడం.. ఓటర్లు అభ్యంతరం తెలిపిన సందర్భాలూ ఉన్నాయి. ఎలాగోలా ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు తిరిగి ఇంటికి వెళ్లాలంటే నానా యాతన పడేవారు. ఇలాంటి ఇబ్బందులన్నీ గమనించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా పరిష్కారమార్గం చూపింది. 80ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ ప్రక్రియను జిల్లాలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 997 మందికి హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించారు. హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహణకు 60 మొబైల్ పోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో హోం ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 53 దరఖాస్తులు రాగా.. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో 159, పత్తికొండ నియోజకవర్గంలో 118, కోడుమూరు నియోజకవర్గంలో 127, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 171, మంత్రాలయం నియోజకవర్గంలో 78, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గంలో 63, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 228 దరఖాస్తులు వచ్చాయి.

రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కర్నూలు(కలెక్టరేట్), మే 4: సార్వత్రిక సమరంలో మొదటి ప్రక్రియ పోస్టల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. సృజన ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. అన్ని రకాల ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకు 20,365 దరఖాస్తులు వచ్చాయి. ఫెసిలిటేషన్ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు ఏ నియోజకవర్గంలో ఓటు హక్కు ఉంటే ఆ నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు వారు పని చేస్తున్న నియోజకవర్గ కేంద్రంలోని పెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు.

ఫెసిలిటేషన్ కేంద్రాలు ఇవే...

- **కర్నూలు అసెంబ్లీ(137):** ఇందిరా గాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, ఏ.క్యాంపు, కర్నూలు
- **పాణ్యం(138):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బీ. క్యాంపు, కర్నూలు
- **పత్తికొండ(142):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ఎదురుగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, పత్తికొండ.
- **కోడుమూరు అసెంబ్లీ(143):** ప్రభుత్వ టౌన్ మోడల్ హై స్కూల్, కోట్ల సర్కిల్, పాత కంట్రోల్ రూమ్ దగ్గర, కర్నూలు.
- **ఎమ్మిగనూరు(144):** ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం, ఎమ్మిగనూరు.
- **మంత్రాలయం(145):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంత్రాలయం
- **ఆదోని (146):** నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ గ్రౌండ్, ఆదోని మున్సిపల్ కార్యాలయం వెనుక, ఆదోని.
- **ఆలూరు(147):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-2 అంబేద్కర్ సర్కిల్ దగ్గర, ఆలూరు.

వైద్య రంగ సమస్యల పరిష్కారానికి కృషి

● టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

నంద్యాల (నూనెపల్లె), మే 4: టీడీపీ అధికారంలోకి రాగానే వైద్య రంగంలో ఆసుపత్రుల యాజమాన్యం, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ రవికృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల ఆత్మీయ సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. శబరి, ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో వైద్యులు ఎదుర్కుంటున్న సమస్యల గురించి డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నారా చంద్రబాబుతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరిస్తామని శబరి, ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ సమేవేశానికి వైద్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర దూదేకుల పెడరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ బాబన్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫరోజ్, డాక్టర్ ఎన్ఎండి ఖలీల్, డాక్టర్ సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

'దళితుల ద్రోహి జగన్'

రాష్ట్రంలో 27 దళిత పథకాలను రద్దు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచారని టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ధ్వజమెత్తారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మాదిగ సేవాసంఘం ప్రచార కరపత్రాలను ఆమె విడుదల చేశారు. సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

'వాల్మీకులకు అండగా టీడీపీ'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మే 4: వాల్మీకుల హక్కుల కోసం కృషిచేస్తామని, టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు అధ్యక్షతన శనివారం నంద్యాలలో వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బైరెడ్డి శబరి, ఫరూక్‌తో పాటు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, ఏపి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, వాల్మీకి సామాజిక వర్గ రాష్ట్ర , జిల్లా నాయకులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వైసీపీ జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అనేక బాధలు పడ్డారని అన్నారు. రాష్ట్రానికి జగన్ ఏమి చేశారని మళ్లీ ఓటు వేయాలని ప్రశ్నించారు, వాల్మీకుల సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీదే అధికారం'

నంద్యాల రూరల్: వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం అని ఆ పార్టీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ జోస్యం చెప్పారు. ఎన్డీఏ కూటమి సైతం విజయ కేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఫరూక్‌తో పాటు టీడీపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర విత్తనాభివభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చగల సమర్థుడు చంద్రబాబు అని, ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవిబాబు, మహేశ్వరరెడ్డి, రమణారెడ్డి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక

గోస్పాడు, మే 4: గోస్పాడుకు చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ద్వారం వీరారెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పారు. నంద్యాలకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరిల ఆధ్వర్యంలో వీరారెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు.

శిల్పా చేసిన అభివృద్ధి శూన్యం: బుడ్డా



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

ఆత్మకూరు, మే 4: శ్రీశైల నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. శనివారం ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం, బైర్లూటి, సంజీవనగర్‌తండా, సిద్ధాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా వెంకటాపురంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బుడ్డా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా శిల్పా ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో ఓట్లు అడుతున్నారని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో సుమారు రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశానని వివరించారు. ఆత్మకూరు మండలంలో రూ.116 కోట్లతో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, పంట పొలాలకు రస్తాలు, తాగునీటి ట్యాంకులు నిర్మించామని చెప్పారు. సిద్ధాపురంలోని అన్ని కాలనీలకు సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేయిస్తానని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు సుబ్బారావు, సర్పంచ్‌లు మహానంది గంగాదేవి, రమణ, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, కొండలరావు, రాజారెడ్డి, రవీంద్రానాయక్, ఈశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

చెంచులతో సమావేశం: బైర్లూటి చెంచుగూడెంలో చెంచులతో టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిస్తే బైర్లూటి, నాగలూటి గూడేల్లో గృహనిర్మాణాలు, రోడ్లు, ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గూడేల్లోని పంట పొలాలకు సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తానని అన్నారు. అలాగే తమనేత చంద్రబాబుతో మాట్లాడి అర్హులైన చెంచులకు భూపంపిణీ చేపట్టేందుకు కృషిచేస్తానన్నారు. అంతకుముందు గూడెంలో చెంచులు ఆయనకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు.

టీడీపీలో చేరిక: ఆత్మకూరులోని కొత్తపేటకు చెందిన ఎస్ఎస్ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎస్ ఖుద్దూస్ ఆధ్వర్యంలో సుమారు 25 ముస్లిం మైనార్టీ కుటుంబాలు, ఆత్మకూరులోని ఏబీఎం కాలనీకి చెందిన సుమారు 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. బండిఆత్మకూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రమణ, మోహన్, పెద్దగుండన్న, బాలు, అంకమ్మ, సరస్వతీతో పాటు సుమారు 20 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. అలాగే తెలుగు యువత నాయకులు ప్రవీణ్, టీడీపీ బీసీ సంఘం నాయకులు ఇరగదిండ్ల మురళీ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. శ్రీశైలానికి చెందిన యూత్ నాయకులు శేఖర్, మాసుం వలి, దుర్వేష్, నాని తదితరులతో పాటు సుమారు 30 కుటుంబాలు వెంకటాపురంలో బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వార్డు సభ్యులు

బండిఆత్మకూరు: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఇద్దరు వైసీపీ అనుచర వార్డు సభ్యులు శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో వెలుగోడు మండలంలోని వేల్పనూరులో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, కరీముల్లాలతో పాటు మరో 7 కుటుంబాలకు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు గ్రామంలో కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మనోహర్‌చౌదరి, పాల శంకర్, రామచంద్రుడు, ఆంబ్రోస్, జాన్, కిట్టు, జాన్ పాల్గొన్నారు.

మహానంది: గాజులపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కలర్స్ రవినాథరావు(రవిస్వామి) ఆధ్వర్యంలో ఆయన అనుచరులు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. బుడ్డా రోడ్ షోలు రవినాథరావుతో పాటు కో ఆప్షన్ మెంబర్ సుభాన్, ఉసేన్ బాషా, మహమ్మద్ రఫీతో పాటు పదుల సంఖ్యలో వైసీపీని వీడి బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరారు.

వేల్పనూరులో బుడ్డా శైలజ ప్రచారం

వెలుగోడు: మండలంలోని వేల్పనూరులోని ఎస్సీ కాలనీలో బుడ్డా శైలజ ప్రచారం చేశారు. వెలుగోడు పట్టణంలోని ఆసర్‌పేట, మదర్‌ఖాన్ వీధి, మంచి నీళ్ల బావి కాలనీలలో బుడ్డా శైలజ సోదరి అనురాధ, మాజీ ఎంపిపి అన్నారపు సీతమ్మ ప్రచారం చేశారు. ఎస్సీ కాలనీలో మాజీ సర్పంచ్ కలాం, సీపీ నగర్‌లో టీడీపీ నాయకులు పాలశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఖలీల్ మోమిన్ రసూల్, హిదాయత్, వజీర్, సర్‌ఫరాజ్, జనసేన నాయకులు షాలుబాషా, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు రాజశేఖరరెడ్డి, ప్రతాప్ ఆచారి, పురుషోత్తం పాల్గొన్నారు.



వేల్పనూరులో ప్రచారం నిర్వహిస్తున్న బుడ్డా శైలజ



వెలుగోడులో ప్రచారంలో పాల్గొన్న అనూరాధ



సుండిపెంటలో ప్రచారం చేస్తున్న మేఘన రెడ్డి

సుండిపెంటలో మేఘన రెడ్డి ప్రచారం

శ్రీశైలం: శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి తనయురాలు మేఘనారెడ్డి శనివారం సుండిపెంటలోని వెస్ట్రన్ కాలనీలో యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కూటమి నాయకులు యుగంధర్‌రెడ్డి, వెంకటరమణ, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సాయిరాం, మల్లికార్జున, కన్నయ్య, ఉమామహేశ్వరరావు, ప్రవీణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేస్తే రౌడీలదే రాజ్యం: మాండ్ర



నందికొట్కూరులో రోడ్ షో



ఎదురుపాడులో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

కొత్తపల్లి, మే 4: ప్రజలకు అందుబాటులో లేని వైసీపీ అభ్యర్థి దారా సుధీర్‌కు ఓటు వేస్తే నందికొట్కూరులో రౌడీలే రాజ్యమేలుతారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, జడ్‌వారిపల్లి గ్రామాల్లో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి మాండ్ర శనివారం రోడ్ షో నిర్వహించారు. అనంతరం మాండ్ర మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలోని జడ్‌వారిపల్లె వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యను, ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండి జయరాజు, చంద్రశేఖర్ యాదవ్, రాధాకృష్ణారెడ్డి, మారెన్న, శేఖర్, నాగార్జున, చంద్రగౌడు, రహీంఖాన్, స్వామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లింగస్వామి, మహేష్, నారాయణ, నాగేశ్వరరావు యాదవ్, జహరుల్లా, శివారెడ్డి, శ్రీనాథరెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: బీసీ, ఎస్సీలకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. పట్టణంలోని 12, 13, 14, 16, 17, 27 వార్డుల్లో మాండ్ర రోడ్డు షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. మాండ్ర మాట్లాడుతూ నా బీసీ, నా ఎస్సీ అంటూ వారికి జగన్ నమ్మకద్రోహం చేశారని, నిజంగా బీసీ, ఎస్సీలకు న్యాయం చేసే సత్తా ఉన్న ఏకైక వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నందికొట్కూరు నందన వనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యకు, ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరికి సైకిల్ గుర్తులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, నాయకులు షకీల్ అహ్మద్, ముర్తుజావళి, జాకీర్, రబ్బాని, లాయర్ జాకీర్, జమీల్, రసూల్, శాంతరాజు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: రాష్ట్రాన్ని పర్వనాశనం చేస్తున్న వైసీపీని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య పిలుపునిచ్చారు. నందికొట్కూరు మండలంలోని కోళ్ళబావాపురం గ్రామంలో శనివారం రోడ్ షో, కోనేటమ్మపల్లె గ్రామంలో పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె రఘురామిరెడ్డి, దామోదరెడ్డి, రామిరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో రైతులను కంటి నిండా నిద్ర పోనివ్వకుండా వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్‌ను తీసుకొచ్చిందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మండిపడ్డారు. అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తాజయసూర్య సమక్షంలో టీడీపీ నాయకులు పల్లె రఘురామిరెడ్డి, ఆధ్వర్యంలో కోళ్ళబావాపురం గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు జయరాముడు, వార్డు సభ్యురాలు రమణమ్మ, భలేశ్వర్‌యాదవ్, కుమార్, మల్లికార్జున, మద్దిలేటి, స్వాములు తదితరులు టీడీపీలో చేరారు.



అల్లూరులో మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు



పగిడ్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగారెడ్డి

● పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్ టీడీపీ నాయకుడు బండియరాజు ప్రోత్సాహంతో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నెహ్రూనగర్ (అర్లపాడు)గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో శ్రీకాంత్, అశోక్, మధుసూదన్, సలాం, శాలిబాషా, మనోజ్ తదితరులు ఉన్నారు.

మిడుతూరు: నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో కాతా రమేష్ రెడ్డి, మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వీపనగండ్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అల్లూరు గ్రామంలో టీడీపీలో చేరారు. శేషన్న, ఏసన్న, చిన్న స్వాములు, నాగన్న, శేఖర్, దేవరాజు, సుధాకర్, భాస్కర్‌తో పాటు 35 కుటుంబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పగిడ్యాల: మండలంలోని ప్రాతకోటలో సర్పంచ్ శేషమ్మ, లక్ష్మాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ గోవింద్, మద్దిలేటి గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణ, నాగశేషులు, శంకర్, తదితరులు ఉన్నారు.

● పగిడ్యాలలో టీడీపీ సీనియర్ నాయకుడుమాండ్ర లింగారెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మేనిఫెస్టో గురించి వివరించారు.

గ్రామాల్లో టీడీపీ నాయకుల ప్రచారం

జూపాడుబంగ్లా, మే 4: మండలంలోని మండ్లెం, తరిగోపుల గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. మండ్లెం గ్రామంలో మండల నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, తిరుపాలు, తరిగోపుల గ్రామంలో నారాయణరెడ్డి, గిరీశ్వరరెడ్డి, దొరబాబురెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాల కోరారు.

గడివేముల: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి అన్నారు. గడివేములలో శనివారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. వైసీపీ నాయకులు దోచుకోవడం, దాచు కోవడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మే 4: నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజక వర్గంలో 354, శ్రీశైలంలో 271, నందికొట్కూర్‌లో 301, నంద్యాలలో 351, బనగానపల్లెలో 332, డోన్‌నియోజక వర్గంలో 349, వెరసి మొత్తం 1958 బ్యాలెట్ యూనిట్లను అన్ని నియోజకవర్గాలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సముక్షంలో ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ లో అత్యంత పారదర్శకతతో నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను చేపట్టామని తెలిపారు.

తాగునీటి సరఫరా పేరుతో వైసీపీ ప్రచారం



పాణ్యం ఎస్సీ కాలనీలో వైసీపీ నాయకుడు, సర్పంచ్‌కు చెందిన ట్రాక్టరుతో నీరు సరఫరా

పాణ్యం, మే 4: స్థానిక ఎస్సీ కాలనీలోని తాగునీటి సమస్యను ఆసరాగా చేసుకొని తాగునీటి సరఫరా దాపున వైసీపీ ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు జిల్లా టీడీపీ కార్యదర్శి రమణమూర్తి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని తాగునీటి సమస్యను స్థానిక పంచాయతీ అధికారులు గుర్తించి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏ పార్టీకి చెందని ట్యాంకరును ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కాగా ఎస్సీ కాలనీలో ట్యాంకరుపై కొండజూటూరు వైసీపీ సర్పంచ్ పేరుతో ఉన్న ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాగునీరు అవసరమైతే మేజర్ గ్రామ పంచాయతీలో ఒక్క ట్యాంకరు లేనట్లు కొండజూటూరు నుంచి ట్యాంకరు తెప్పించి నీటిని సరఫరా చేయడం ఓట్ల రాజకీయమేనన్నారు. తాగునీటిని అడ్డం పెట్టుకున్నంత మాత్రాన ఓట్లు పడవన్నారు. ట్యాంకరు సరఫరాపై ఎన్నికల అధికారులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం పాణ్యంలో వైసీపీ అభ్యర్థి కాటసానిరాంభూపాల్‌రెడ్డి పర్యటనలో ఎస్సీల నుంచి నిరసనలు వ్యక్తమవుతాయన్న కారణంతో ఈ తాగునీటి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. గతంలో ఎస్సీ కాలనీకి వెళ్లలేని పరిస్థితిని ఎమ్మెల్యే ఎదుర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు తాగునీటి సమస్య ఏర్పడితే నిరసనలు మరింత ముదిరే ప్రమాదం ఉందని, దీంతో తాగునీటిని మేమే సరఫరా చేశామని చెప్పుకోవచ్చన్న దుస్థితి వైసీపీ నాయకులకు ఏర్పడిందని అన్నారు. తాను వైస్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టామన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆనందరావు మాట్లా డుతూ పార్టీల సమస్యలు ఉంటాయన్న కారణంగా ఏ పార్టీకి చెందని ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం బోర్లలో నీరు తగ్గడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తూ తాగునీటి సమస్య తీరుస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరిన్ని తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

వైసీపీకి ప్రముఖ విద్యా సంస్థ అధినేత గుడ్‌బై?

నంద్యాల రూరల్, మే 4: పట్టణంలోని ఓ ప్రముఖ విద్యా సంస్థ అధినేత వైసీపీని వీడే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గరిష్ట స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే సత్తా ఉండి ఎమ్మెల్యేకు అంత్యంత సన్నిహితుడైన సదరు విద్యా సంస్థ అధినేతకు 8,9 వార్డుల్లో అజాత శత్రువు అనే పేరు ఉంది. తనన కొంతకాలంగా నిర్లక్ష్యం చేస్తున్నారని అంతర్మథనం చెందుతున్నట్లు విద్యావేత్త సన్నిహితులు చెబుతున్నారు. వార్డు ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవటానికి వార్డు కౌన్సిలర్ కంటే కూడా అజాత శత్రువులాంటి విద్యావేత్తను ఆశ్రయించేవారు. నొప్పించక తానొవ్వ అనే రీతిలో సామరస్యంగా వార్డు ప్రజలు సమస్యలు పరిష్కరించేవారు. కారణమేంటో తెలియదు కానీ గత కొంతకాలంగా వైసీపీ అధిష్ఠానంపై ఈయన అలకబూనినట్లు విశ్వసనీయ సమాచారం. వార్డులో తనకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఓ కో ఆప్షన్ మెంబర్ తో పాటు వార్డు కౌన్సిలర్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని, మర్యాద లేనప్పుడు పార్టీలో ఉండటం కన్నా వైసీపీని వీడటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వార్డులో హాట్ టాపిక్ నడుస్తోంది. వార్డులో జరిగిన పర్యటనలో మధ్యలో అలిగివెళ్లారు. ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి విద్యావేత్తను బుజ్జగించి ప్రచారానికి తీసుకరావటం వెనుక ఎన్నికల వేళ వైసీపిలో ముదురుతున్న అసంతృప్తికి అద్దం పడుతోంది. ఎమ్మెల్యే శిల్పాలో పట్టుకోల్పోతున్న దైన్య స్థితి కనిపిస్తోంది. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సైతం విద్యావేత్తను బుజ్జగించే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది.

టెక్నాలజీలో సిగ్నల్స్ ప్రాసెసింగ్ సొసైటీ కీలక పాత్ర



సొసైటీ అనుమతి పత్రాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్

పాణ్యం, మే 4: టెక్నాలజీ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సిగ్నల్స్ ప్రాసెసింగ్ సొసైటీ కీలక పాత్ర వహిస్తుందని హైదరాబాదు ఐఈఈఈ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా ఐఈఈఈ ప్రాసెసింగ్ సొసైటీ ప్రారంభించింది. శనివారం ఆన్‌లైన్‌లో ఆమె విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడుతూ ఈ సొసైటీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రాథమిక అంశమైన సిగ్నల్స్ ప్రాసెసింగ్ సిద్ధాంతం, అభ్యాసాన్ని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పరిశోధన, విద్య, నిపుణుల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. టెలికమ్యూనికేషన్స్, ఆడియో ప్రాసెసింగ్, మెడికల్ ఇమేజింగ్ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. కమ్యూనికేషన్, డేటా విశ్లేషణ, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ టెక్నాలజీల భవిష్యత్తును రూపొందించడంలో దీని ప్రాముఖ్యం ఉంటుందన్నారు. సొసైటీ అనుమతి పత్రాన్ని కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, మల్లికార్జున, హెచ్ఓడీ డాక్టర్ నరసింహులు, ఐఈఎస్ హైదరాబాద్ కోశాధికారి డాక్టర్ సోఫియా ప్రియదర్శిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

ఆళ్లగడ్డ, మే 4: దేశం, రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్.తులసిరెడ్డి చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తి పోయారన్నారు.

టీడీపీలో చేరిక

బనగానపల్లె, మే 4: బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు నాగేశ్, బాలసుబ్బరాయుడు, శివన్న, వెంకట శివుడు, వెంకటసుబ్బ రాయుడు, సుదర్శన్, సురేశ్, వెంకటసుబ్బయ్య, పరమేశ్, మహేశ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కుమ్మరిమద్దిలేటి, పురుషోత్తం, నాగేంద్ర, తిరుపాలు, పవన్‌కుమార్ తదితర 20 కుటుంబాలు వైసీపీని వీడి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించ డానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా టీడీపీకి ఓట్లు వేయాలన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.12.19 లక్షలు

బేతంచెర్ల, మే 4: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.12.19 లక్షలు సమకూరినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.12,19,345లు దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

ప్యాపిలి, మే 4: మండలంలోని సిద్ధనగట్టు రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో రామాయణం, భగవద్గీత, మహాభారతంపై ధార్మిక ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు దేవీదయా నందసింగ్, ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, సూర్యప్రకాష్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం

డోన్, మే 4: చంద్రబాబు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం పెడతారని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శనివారం పట్టణంలోని 2వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రికే గాయత్రీ దేవి, సౌజన్య, చాటకొండ రజిని, సరోజ పాల్గొన్నారు.

నేత్రాలు దానం

బేతంచెర్ల, మే 4: మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన నడిపి తిరుపాలు (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐ బ్యాంకుకు సమాచారం ఇవ్వడంతో ఐ బ్యాంక్ నుంచి ఐ టెక్నీషియన్ గంగాధర్ మృతుడి నేత్రాలను సేకరించారు. షేక్షావలి, గౌస్ లైఫ్ యువనేత్ర మెంబర్స్ వచ్చి నేత్రాలను భార్య గోరంట్లమ్మ కొడుకు సురేష్, కూతురు లక్ష్మీదేవి, ఐ బ్యాంక్ టెక్నీషియన్‌కు అందజేశారు. కార్యక్రమంలో లైఫ్ యువనేత్ర సభ్యులు షేక్షావలి పాల్గొన్నారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కోవెలకుంట్ల, మే 4: ప్రతి ఒక్కరూ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర శనివారం అన్నారు. మండలంలోని భీము నిపాడు, కంపమల్ల గ్రామాల్లో ఎస్ఐ వరప్రసాద్, కేంద్రబలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ జయచంద్ర మాట్లాడుతూ గ్రామా ల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం

సంజామల, మే 4: మండలంలోని గిద్దలూరు గ్రామంలో కూటమి టీడీపీ అభ్యర్థులను బలపరుస్తూ శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు గిద్దలూరులో ఇం టింటి ప్రచారం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగా ఆదేశాల మేర కు జిల్లా కార్యదర్శి మిద్దె వెంకట్రాముడు, మండల టీడీపీ ఇన్‌చార్జి బత్తు ల ప్రతాప్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొ న్నారు.

17 మంది వలంటీర్ల రాజీనామా

సంజామల, మే 4: మండల కేంద్రమైన సంజామలలో శనివారం 17 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు పంచాయితీ కార్యదర్శి గోపీనాథ్ తెలిపారు. వీరి రాజీనామాను ఉన్నత అధికారులకు నివేదించామన్నారు. సంజామలలో 21 మంది వలంటీర్లు ఉండగా వారిలో 17 మంది రాజీనామా చేశారన్నారు.

కాటసానికి ఓటు అడిగే హక్కు లేదు

- నాపరాళ్ల పరిశ్రమను నాశనం చేసిన ఘనత ఆయనదే
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, మే 4: కొలిమిగుండ్ల మండలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు జీవనాధారమైన నాపరాళ్ల పరిశ్రమను నాశనం చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రజలను ఓటు అడిగే హక్కు ఎంత మాత్రం లేదని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి మండిపడ్డారు. శనివారం కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లె, బందార్లపల్లె, పేట్నికోట, తుమ్మలపెంట గ్రామాల్లో బీసీ జనార్దనరెడ్డి రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. సంక్షేమ పథకాల్లో సైతం అర్హులకు కోత విధించారని విమర్శించారు. చరిత్రలో ఎక్కడాలేని విధంగా రామ్‌కో సిమెంటు పరిశ్రమకు విక్రయించిన భూములకు రూ.38 కోట్లు అదనపు పరిహారం ఇప్పించిన ఘనత తనదేనని గర్వంగా చెబుతానన్నారు. విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసర ధరలతో పాటు మద్యం ధరలను ఇష్టానుసారంగా పెంచి, పేదల జీవితాలను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. అసైన్డ్ భూముల పంపిణీ పేరుతో డబ్బులు దోచుకున్నారన్నారు. గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టని వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని బీసీ ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, ఉలువల నరసింహుడు, కళ్యాణ్‌రెడ్డి, అయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

బనగానపల్లె: కొలిమిగుండ్ల మండలం కోటపాడు, కోరుమానుపల్లెకు చెందిన వైసీపీ నాయకులు శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కోటపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఓబులేసు, చిన్నయ్య, నరసింహులు, వెంకట నారాయణ, వెకంటరాముడు, గని, నవీన్, పక్కీరా, వెంకట సుబ్బయ్య, షేక్షావలి, అర్జున్, రాము, వెకంసటుబ్బయ్య తదితర 12 కుటుంబాలు చేరాయి. అలాగే కోరుమానుపల్లె గ్రామానికి చెందిన నాగప్ప, పక్కీర్‌బాషా, నాగేంద్ర, రాఘవలు టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అరాచక పాలనకు అంతం తప్పదు: బీసీ ఇందిరమ్మ

అవుకు: వైసీపీ అరాచక పాలనకు ఈ ఎన్నికల్లో అంతం తప్పదని బనగానపల్లె టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా అవుకు మండలంలోని వేములపాడు, గోకులదిన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేములపాడు గ్రామ సర్పంచ్ బోయిన సుబ్బలక్ష్మన్న, బోయిన గురప్ప ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీ ఇందిరమ్మకు ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో గతంలో బీసీ చేసిన అభివృద్ధి తప్ప కాటసాని పాలనలో అభివృద్ధి ఏమాత్రం జరుగలేదన్నారు. వేములపాడు, గోకులదిన్నె టీడీపీ నాయకులు ప్రభాకర్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమకృష్ణుడు, రామిరెడ్డి, మధుసూదన్‌రడ్డి, సాంబశివుడు, రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



బీసీకి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వైసీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులు తాకట్టే: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులు తాకట్టు పెడతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు అవుకు పట్టణానికి వచ్చిన బీసీ క్షీరారెడ్డి, మనోరమ, బీసీ మౌర్యనాథరెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగ తం పలికారు. టీడీపీ నాయకులు ఐ ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మోట్ల రామిరెడ్డి, కాశీపురం సర్పంచ్ మొట్ల లావణ్య, చల్లారాజ్యలక్ష్మి, బత్తిన మద్దిలేటిగౌడ్‌తో బీసీ కుటుంబ సభ్యులు కలసి బెస్తవీధి, బుగ్గవీధి, ముస్లిం వీధి, ఎస్సీ కాలనీల్లో సూపర్ సిక్స్ కరపత్రాలు ప్రజలకు అందించారు. చల్లా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మద్యపాన నిషేధం, పోలవరం, ప్రత్యేక హోదా హామీలను వైసీపీ ప్రభుత్వం మరిచిందని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కాటసాని రామిరెడ్డికి సంపాదనపై ఉన్న ఆసక్తి బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధిపై లేదన్నారు. టీడీపీ నాయకులు వెంకటరమణ నాయక్, దంతెల రమణ, తిక్కన్న, వెంకట రాముడు నాయక్, తిరుమలనాయక్, మిద్దె ప్రసాద్, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.







బీసీ ఇందిరమ్మకు స్వాగతం పలుకుతున్న టీడీపీ సర్పంచ్ సుబ్బలక్ష్మమ్మ తదితరులు, మహిళలకు కరపత్రాలు అందిస్తున్న బీసీ క్షీరారెడ్డి, మనోరమ, అవుకులో ప్రచారం నిర్వహిస్తున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి

దోపిడీ చేసి నీతులు మాట్లాడటమా?

- లిక్కర్ వ్యాపారంతో సంబంధం నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా
- సిమెంటు ఫ్యాక్టరీని లాక్కున్నది బుగ్గన కాదా...!
- ఆర్థిక మంత్రిపై కోట్ల ఫైర్

డోన్, మే 4: వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఐదేళ్ల పాటు దోపిడీ చేసి ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం డోన్ మండలంలోని ఓబులాపురం, ఎర్రగుంట్ల, పెద్ద మల్కాపురం, చనుగొండ్ల, ఇందిరాంపల్లి గ్రామాల్లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ ప్రజల్లో వైసీపీకి వస్తున్న వ్యతిరేకతను చూసి మంత్రి బుగ్గన మతిభ్రమించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. లిక్కర్ వ్యాపారాలతో తనకు సంబంధం ఉందని బుగ్గన ఆరోపణలు చేస్తున్నారని, దాన్ని నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని కోట్ల సవాల్ విసిరారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని లాక్కున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. సిమెంటు ఫ్యాక్టరీలో స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించి కార్మికులకు అన్యాయం చేయలేదా? అని నిలదీశారు. ఆర్థిక మంత్రిగా బుగ్గన డోన్ నియోజకవర్గ రైతులను ఏరోజైనా పట్టించుకున్నారా? అని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, ధర్మవరం చిన్న నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకటనారాయణ, వడ్డె నారాయణ, చనుగొండ్ల వెంకోబరావు, కోనేటి కాశీ, శ్రీరాములు, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన ఓబులాపురం వైసీపీ కార్యకర్తలు



మహిళలతో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

● **టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు:** మండలంలోని ఓబులాపురం గ్రామంలో శేషిరెడ్డి ఆధ్వర్యంలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో పార్టీ మారారు.

టీడీపీని ఆదరిస్తే ఉచిత గ్యాస్ సిలిండర్లు: కోట్ల సుజాతమ్మ

ప్యాపిలి: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరిస్తే ప్రతి కుటుంబానికి ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే మహి ళలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఉచిత బస్సుతో పాటు పొదుపు మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర రావుయాదవ్, టి శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, రాజా నారాయణమూర్తి, అంకిరెడ్డి, నాగేంద్ర, గండికోట రమేష్ పాల్గొన్నారు.

నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక



జిల్లెల్ల జయసింహారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్

శిరివెళ్ల, మే 4: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన జిల్లెల్ల జయసింహారెడ్డి.. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. యువగళం యాత్రలో భాగంగా నంద్యాలకు విచ్చేసిన నారా లోకేశ్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జయసింహారెడ్డికి టీడీపీ కండువాను వేసి నారా లోకేశ్ పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నంద్యాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బైరెడ్డి శబరి, ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు.

రుద్రవరం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రుద్రవరం మండలంలోని కె.కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు బచ్చు నాగేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ, నంద్యాల ఎంపీ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి విజయానికి కృషి చేస్తామని అన్నారు.

'రాక్షస పాలనకు అంతం పలకాలి'

నంద్యాల, మే 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస పాలనకు అంతం పలకాలని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వక్కపెళ్ల మాబాషా, సుంగల రసూల్, అహమ్మహుసేన్‌తో పాటు పది కుటుంబాలు భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో ఆళ్లగడ్డలో టీడీపీలో చేరారు.

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నరసింహారెడ్డితో పాటు మరికొందరు టీడీపీలో చేరారు.

పింఛన్‌దారుల అవస్థలు

చాగలమర్రి, మే 4: పింఛన్‌దారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గత నెల సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్‌లను పంపిణీ చేసింది. అయితే ఈనెల మాత్రం వృద్ధుల ఖాతాలకు పింఛన్ సొమ్ము జమచేయడంతో పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పింఛన్ అందక కష్టాలు పడుతున్నారు. శనివారం పింఛన్ సొమ్ము కోసం మీ సేవ వద్ద ఏర్పాటు చేసిన ఎస్బీఐ బీసీ పాయింట్ వద్ద పడిగాపులు కాశారు. సర్వర్ సమస్యతో పింఛన్‌దారులు గంటల తరబడి నిరీక్షించారు. చివరకు కొందరు పింఛన్‌దారులు ఎండవేడిమిని తట్టుకోలేక ఇంటిదారి పట్టారు. ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందడానికి ఇలాంటి కుట్రలు చేయడం ఏమిటని వృద్ధులు అసహనం వ్యక్తం చేశారు.

రుద్రవరం: పింఛను కోసం రుద్రవరం కెనరా బ్యాంకు వద్దకు వచ్చిన లబ్ధిదారులు శనివారం ఎండలో అవస్థలు పడ్డారు. రెండు కిలోమీటర్లు ఎండలోనే బ్యాంకు వద్దకు వచ్చామని ఆర్.కొత్తూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు హుసేనమ్మ వాపోయారు. బ్యాంకు వద్ద పింఛనుదారులు అధికంగా ఉండడంతో నిరీక్షించాల్సి వచ్చిందని అన్నారు. ఇంటి వద్దకు పింఛన్ పంపిణీ చేయాలని కోరారు.

వైసీపీకి గుణపాఠం చెప్పండి

బేతంచెర్ల, మే 4: రాష్ట్ర ప్రజలకు నవరత్నాల పేరుతో వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండలంలోని తవిసికొండ, హుశేనాపురం, గూటిపల్లె గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఎల్ల నాగయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రచారాన్ని నిర్వ హించారు.

● అలాగే సిమెంటు నగర్‌లో కోట్ల చిత్రమ్మ శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీని గెలిపించండి

కోవెలకుంట్ల, మే 4: టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని పెద్దకొప్పెర్ల టీడీపీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగన్న, ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాత్రి చిన్నఈశ్వరయ్యలు కోరారు. శనివారం కోవెలకుంట్ల మండలంలోని వెలగటూరు, బిజనవేముల, గోవిందిన్నె, పెద్దకొప్పెర్ల, చిన్న కొప్పెర్ల, వల్లంపాడు, లింగాల, రేవనూరు, కలుగొట్ల, జోలదరాసి గ్రామాల్లో పర్యటించి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అహోబిలంలో వసంతోత్సవాలు ప్రారంభం

నంద్యాల, మే 4(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం వేదపండితులు ఉత్సమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వేకువజామున్నే విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు.

ఏడుగురిపై బైండోవర్ కేసు

సంజామల, మే 4: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ముందస్తుగా మండల వ్యాప్తంగా అనుమానిత వ్యక్తులపై బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆల్వకొండ గ్రామానికి నలుగురిని, గిద్దలూరుకు చెందిన ఇద్దరిని, ఆర్‌లింగందిన్నె ఒకరిని బైండోవర్ చేసి తహసీల్దారు ఎదుట హాజరు పరచి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీతోనే మహిళా సంక్షేమం: అఖిలప్రియ





ఖాదరబాదరలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ, టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ

శిరివెళ్ల, మే 4: రాష్ట్రంలోని మహిళల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్లలోని 103, 104, 105 బూత్‌ల పరిధిలోని ఖాదరబాదర గ్రామంలో శనివారం మహిళలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అఖిలప్రియ మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఘనత టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఖాదరబాదర గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఖాజా హుసేన్, మహమ్మద్ హుసేన్, నాలి వలి, గని ఫిదా, వసీం, ఫిదా హుసేన్, గుర్రప్ప, సూరా రామ, బ్రహ్మయ్య, వెంకట చెన్నుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

రుద్రవరం: ప్రజల పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో ఉందుకు?, అవినీతి పాలనకు చరమగీతం పాడాలని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శనివారం రుద్రవరం మండలం ఆర్.కొత్తపల్లె గ్రామాన్ని సందర్శించారు. వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీలో చేరిక: మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో గంధం పెద్దరాశిరెడ్డి, గంధం జనార్దనరెడ్డి వారి అనుచరవర్గం 50 కుటుంబాలు టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● కొండమయాపల్లె గ్రామానికి చెందిన మారాసుతిరుపాల్, వీరేశ్ మరో పది కుటుంబాలు ఆళ్లగడ్డలో భూమా స్వగృహంలో టీడీపీలో చేరగా భార్గవ్‌రామ్‌నాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

● యల్లావత్తుల గ్రామానికి చెందిన గోవిందు, రమణతో పాటు 25 కుటుంబాలు ఆళ్లగడ్డలో భూమా నివాసంలో టీడీపీలో చేరారు. భార్గవ్‌రామ్‌నాయుడు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్‌వీ రంగనాయకులు, పోలా గురుమూర్తి, మనోహర్‌రెడ్డి, రాజారావు, బాలరాజు, బ్రహ్మయ్య, సత్యనారాయణ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే పేదలకు న్యాయం'

చాగలమర్రి: టీడీపీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. మండలంలోని తిప్పనపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం కలుగొట్లపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరితోపాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. నాయకులు నరసింహారెడ్డి, జమాల్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, పుల్ల య్య, బాబయ్య, బ్రహ్మం, రమణారెడ్డి, కిట్టు, బాలుడు, బాల దస్తగిరి పాల్గొన్నారు.



కలుగొట్లపల్లెలో భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు